సాక్షి జనగామ

శుక్రవారం | 20 | జనవరి | 2023



'ఐటీ హబ్'కు నిర్లక్ష్యపు వైరస్

వరంగల్‌ను ఐటీ హబ్‌గా మార్చుతామన్న పాలకుల హామీకి నిర్లక్ష్యపు వైరస్ పట్టుకుంది. మౌలిక వసతుల లేమితో ఇప్పటి వరకు వచ్చింది నాలుగు కంపెనీలే. - 8లో▸



గంజాయి ముఠా గుట్టురట్టు

ఛత్తీస్‌గఢ్ నుంచి జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు గంజాయి తరలిస్తున్న ముఠాను పట్టుకున్నట్లు కాటారం డీఎస్పీ రాంమోహన్‌రెడ్డి తెలిపారు. - 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం 29°/17°

వాతావరణం

ఉదయం తేమతో కూడిన చల్లని వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు కాస్త తగ్గుతాయి. రాత్రి పూట చలి తీవ్రత పెరుగుతుంది.

కుదరని సమన్వయం

- తొలిరోజు 3,515 మందికి కంటి పరీక్షలు
- 720 మందికి రీడింగ్ అద్దాల పంపిణీ
- 853 మందికి ఆన్‌లైన్‌లో సైట్ గ్లాస్ ఆర్డర్
- అక్కడక్కడా కనిపించిన సౌకర్యాల లేమి
- కంటి పరీక్షల రిజిస్ట్రేషన్‌కు ఎగబడ్డ జనం
- ఫోన్ నంబర్ లేక ఇబ్బంది పడ్డ వృద్ధులు

జనగామ: 'కంటి వెలుగు'పై ప్రత్యేక ఫోకస్ పెట్టాలి.. ఎక్కడా ఇసుమంత ఇబ్బంది ఉండకూడదు.. కనీస మౌలిక వసతులు కల్పించాలి.. అన్ని శాఖలు సమన్వయంతో ముందుకెళ్లాలి'.. అంటూ నెల రోజులుగా సీఎం కేసీఆర్‌తోపాటు మంత్రి, ఎమ్మెల్యేలు, కలెక్టర్ సమీక్షలు నిర్వహించినా.. మొదటి రోజు చాలాచోట్ల సమన్వయం కనిపించలేదు. పకడ్బందీగా ఏర్పాట్లు చేసినా.. అక్కడక్కడా సమస్యలు తలెత్తాయి. ఆన్‌లైన్‌లో పేరు నమోదు చేసే సమయంలో ఫోన్ నంబర్ లేక వృద్ధులు ఇబ్బంది పడాల్సి వచ్చింది. శిబిరాల వద్ద క్యూ పద్ధతి పాటించకపోవడంతో గుంపులు గుంపులుగా జనం రావడంతో గందరగోళ పరిస్థితి ఏర్పడింది. చాలాచోట్ల ఇరుకు గదుల్లోనే కంటి పరీక్షలు నిర్వహించారు. జిల్లా పరిధిలో గురువారం 26 చోట్ల 'కంటి వెలుగు' రెండో విడత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయగా కలెక్టర్ శివలింగయ్య, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, డీసీపీ సీతారాం, డీఎంహెచ్ఓ డాక్టర్ మహేందర్‌తో కలిసి మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, తాటికొండ రాజయ్య, జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి తదితరులు ప్రారంభించారు. మొదటి రోజు 3,515 మందికి కంటి పరీక్షలు చేయగా, 720 మందికి రీడింగ్ అద్దాలు అందజేశారు. అధిక దృష్టి లోపం ఉన్న మరో 853 మందికి సైట్ అద్దాల కోసం ఆన్‌లైన్‌లో ఆర్డర్ పెట్టారు. ఇదిలా ఉండగా.. వైద్య శిబిరాల్లో చాలా మందిని ఆపరేషన్లకు రెఫర్ చేశారు. అయితే సంఖ్య చెప్పడానికి వైద్య ఆరోగ్య శాఖ అధికారులు నిరాకరించారు. ప్రభుత్వం ఆపరేషన్లకు అవకాశం కల్పిస్తే.. మండలాల వారీగా రెఫరల్‌గా గుర్తించిన వివరాలు వెల్లడిస్తామన్నారు.

వృద్ధులకు తప్పని యాతన

లింగాలఘణపురం: నెల్లుట్ల, లింగాలఘణపురం కంటి వెలుగు శిబిరాల్లో వృద్ధులు ఇబ్బంది పడ్డారు. ఆన్‌లైన్‌లో పేరు నమోదు చేసే సమయంలో ఆధార్ నంబర్‌తోపాటు ఫోన్ నంబర్ అవసరం. అయితే క్యూలో నిలబడిన వారు తమ వంతు వచ్చే సరికి ఫోన్ నంబర్ కావాలని సిబ్బంది చెప్పడంతో ఇళ్లకు వెళ్లి మళ్లీ రావాల్సి వచ్చింది.



జనగామ: బాణాపురం శిబిరం వద్ద బారులుదీరిన జనం

జిల్లాలో మొదటి రోజు కంటి పరీక్షల వివరాలు	
శిబిరాల సంఖ్య	26
కంటి పరీక్షలు	3,515
రీడింగ్ అద్దాల పంపిణీ	720
సైట్ అద్దాలకు ఆర్డర్	853

సర్వర్ సతాయింపు..



బచ్చన్నపేట: బచ్చన్నపేట శిబిరంలో కొద్దిసేపు సర్వర్ మొరాయించడంతో ఆన్‌లైన్ ప్రక్రియ ఆలస్యంగా జరిగింది. బచ్చన్నపేట, అలీంపూర్‌లో 278 మందికి పరీక్షలు చేయగా.. 57 మందికి రీడింగ్ అద్దాలు ఇచ్చారు. 45 మందిని కంటి ఆపరేషన్లకు రెఫర్ చేశారు.

అరకొర సౌకర్యాల నడుమ..



స్టేషన్‌ఘన్‌పూర్: స్టేషన్‌ఘన్‌పూర్, ఇప్పగూడెం, తాటికొండ కంటి వెలుగు శిబిరాల్లో తాగునీటి సౌకర్యం కల్పించకపోవడతో దాహంతో జనం అల్లాడి పోయారు. ఇప్పగూడెంలో ఇరుకు గదిలో పరీక్షలు నిర్వహించారు. తాటికొండలో గ్రామానికి దూరంగా ఉన్న రైతు వేదికలో ఏర్పాటు చేయడంతో వృద్ధులు, దివ్యాంగులకు నడక కష్టాలు తప్పలేదు. నిర్వాహకుల మధ్య సమన్వయం లేక పోవడంతో జనం గుంపులు గుంపులుగా రావడంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఆలస్యంగా జరిగింది.

అద్దాలు ఇప్పడన్నా ఇస్తరని..



పోయినసారి కంటి పరీక్షలు చేసింండ్రు. చూపు సరిగా లేదని అద్దాలు ఇస్తామని ఇయ్యలేదు. ప్రైవేట్ ఆస్పత్రిలో చూపించుకుని రూ.350పెట్టి అద్దాలు కొనుక్కున్న. ఇప్పుడైనా ఇస్తరని ఇక్కడికి వచ్చిన.

- జనగామ ఎల్లయ్య, నెల్లుట్ల(లింగాలఘణపురం)

అప్పుడు ఇచ్చిన అద్దాలు పని చేయలేదు



అప్పుడు కంటి పరీక్ష చేసి అద్దాలు ఇచ్చారు. 15 రోజులు కూడా పని చేయలేదు. ప్రైవేట్ ల పరీక్ష చేయించుకోలేదు. ఇప్పుడు మల్ల పరీక్ష చేయించుకున్న. మంచి అద్దాలు ఇస్తమని చెప్పిండ్లు.

- దిగోజు పూలమ్మ, బాణాపురం, జనగామ

దేశానికే ఆదర్శం 'కంటి వెలుగు'

- రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పాలకుర్తి టౌన్/పాలకుర్తి/కొడకండ్ల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'కంటి వెలుగు' దేశానికే ఆదర్శం.. ఈ కార్యక్రమాన్ని ప్రశంసిస్తున్న ఇతర రాష్ట్రాల సీఎంలు తాము కూడా అమలు చేసే ఆలోచన చేస్తున్నారని రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. గురువారం పాలకుర్తి జీపీ కార్యాలయంలో, కొండకండ్ల మండల పరిధి రామవరం గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని కలెక్టర్ శివలింగయ్య, డీఎంహెచ్ఓ మహేందర్, డీసీపీ సీతారాంతో కలిసి ప్రారంభించిన మంత్రి.. అనంతరం మాట్లాడారు. సీఎం కేసీఆర్ వైద్యరంగంలో తెచ్చిన మార్పులతో సర్కారు వైద్యం మాత్రమే కావాలనే రోజులు వచ్చాయన్నారు. కంటి సమస్యలతో బాధపడుతున్న నిరుపేదల సంక్షేమానికి రూ.250 కోట్లతో కంటి వెలుగు కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన ముఖ్యమంత్రి.. పేదల దృష్టి ప్రదాత అని అన్నారు. ఆధునాతన పరికరాలతో కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి అద్దాల పంపిణీతోపాటు ఆపరేషన్లు చేయించనున్నట్లు పేర్కొన్నారు. 18 ఏళ్లు పైబడిన వారంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కంటి సమస్యలు దూరం చేసుకోవాలని కోరారు. పేదలు, రైతుల సంక్షేమానికి నిరంతరం తపించే సీఎం కేసీఆర్ అనేక పథకాలు అమలు చేస్తున్నారని, 75 ఏళ్లలో దేశాన్ని పాలించిన వారు.. తెలంగాణ ప్రభుత్వం ఏం చేసిందో ప్రజలు సమీక్షించుకోవాలని సూచించారు. అనంతరం పరీక్షలు చేయించుకున్న వారికి అద్దాలు, లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో డీఆర్‌డీఓ రాంరెడ్డి, తహసీల్దార్ పాల్‌సింగ్, ఎంపీడీఓ అశోక్‌కుమార్, ఎంపీపీలు నాగిరెడ్డి, జ్యోతి, సర్పంచ్ యాకాంతరావు, దేవస్థానం చైర్మన్ రామచంద్రయ్యశర్మ, జెడ్పీటీసీ పి.శ్రీనివాస్‌రావు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ.మదార్, డీసీసీబీ వైస్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ రాము, ఈజీఎస్ డైరెక్టర్ యాకయ్య తదితరులు పాల్గొన్నారు.



పాలకుర్తి కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి

ఎమ్మెల్యే ముత్తిరెడ్డికి రీడింగ్ అద్దాలు

జనగామ: పట్టణంలోని బాణాపురం 5వ వార్డులో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరంలో ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డికి డాక్టర్లు కంటి పరీక్ష నిర్వహించారు. ప్లస్-3గా నమోదైంది. రెండు కళ్లు బాగానే ఉన్నాయని రిపోర్టు ఇచ్చారు. అయితే రీడింగ్ కోసం 1వ నంబర్ అద్దాలు ఇవ్వడంతోపాటు కళ్లలో మరింత క్లారిటీ కోసం చుక్కల మందు, గోలీలు ఇచ్చారు. స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య స్థానిక శిబిరంలో కంటి పరీక్ష చేయించుకోగా గుడ్ అని వచ్చింది. మంత్రి దయాకర్‌రావు పరీక్ష చేయించుకోలేదు.



ఎమ్మెల్యేకు కంటి పరీక్ష చేస్తున్న డాక్టర్

ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు

- కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య

జనగామ: జిల్లాలో 'కంటి వెలుగు' రెండో విడత శిబిరాల్లో మొదటిరోజు ప్రజలు ఉత్సాహంగా పాల్గొని కంటి పరీక్షలు చేయించుకున్నార ని కలెక్టర్ శివలింగయ్య తెలిపారు. క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఎక్కడ కూడా ఇబ్బందులు తలెత్తకుండా ప్రోగ్రాం ప్రత్యేక అధికారులు నిరంతరం పర్యవేక్షించారని చెప్పారు. ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, జీపీ కార్యదర్శులు, ఇతర ప్రభుత్వ ఉద్యోగులు ప్రజల్లో అవగాహన కల్పించి కంటి శిబిరాలను సద్వినియోగం చేసుకునేలా చూశారని తెలిపారు. జిల్లాలో తొలిరోజు 3,515 మందికి కంటి పరీక్షలు చేయగా.. 720 మందికి రీడింగ్ గ్లాస్‌లు, దృష్టిలోపం అధికంగా ఉన్న 853 మందికి ఆన్‌లైన్‌లో అద్దాలు ఆర్డర్ చేశారని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్

న్యూస్‌రీల్

కళాఉత్సవ్ పోటీల్లో పాల్గొనాలి



జనగామ రూరల్: శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఈనెల 22న హైదరాబాద్ శ్రీపొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీలో నిర్వహించే యువజన కళాఉత్సవ్ పోటీల్లో పాల్గొనాలని యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు చిలుమోజు సాయికిరణ్ అన్నారు. ఈ మేరకు కళాఉత్సవ్ పోస్టర్‌ను గురువారం జిల్లా కేంద్రంలోని స్కాలర్స్ గ్రామర్ హైస్కూల్‌లో ఆవిష్కరించారు. శ్రీశ్రీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు లగిశెట్టి ప్రభాకర్, అయిలా సోమనర్సింహాచారి, జి.కృష్ణ, సాయికిరణ్, అంబాల శివనాథ్, మహేందర్, వరూధిని తదితరులు పాల్గొన్నారు.

నేడు ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం

పాలకుర్తి టౌన్: శ్రీ సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానం నూతన ధర్మకర్తల మండలి శుక్రవారం ప్రమాణ స్వీకారం చేయనుంది. 13 మంది ధర్మకర్తలను నియమిస్తూ దేవాదాయశాఖ కమిషనర్ అనిల్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో వెనుకదాసుల రామచంద్రయ్యశర్మ, కుందురూ నరసింహారెడ్డి, చాలువాది సత్యనారాయణ, బజ్జూరి వేణుగోపాల్, కోటగిరి కుమారస్వామి, తీగల సత్తయ్య, కర్నే రమేష్, కలుసాని ఉప్పల్‌రెడ్డి, దుబ్బాక భాస్కర్‌రెడ్డి, ధారవత్ యాకుబ్ నాయక్, దొపాటి నర్సయ్య, చిదురాల సంధ్యారాణి, చిక్కుడు రాములు, ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ఆలయ ప్రధాన అర్చకుడు దేవగిరి రామన్న ఉన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు గుట్టపై ఉన్న మహామండపంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు హాజరవుతున్నారని ఆలయ ఈఓ నండూరి రజనీకుమారి గురువారం విలేకరులకు చెప్పారు.

నేడు 'సదరం' స్లాట్ బుక్ చేసుకోవాలి

జనగామ రూరల్: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో నిర్వహించే సదరం క్యాంపునకు దివ్యాంగులు మీసేవ ద్వారా స్లాట్ బుక్ చేసుకోవాలని డీఆర్‌డీఓ రాంరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు స్లాట్ అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. ఈనెల 24న శారీరక వికలాంగులకు(కొత్తవి-20, రెన్యూవల్-30), 27న వినికిడి ఉన్న వారికి (కొత్తవి-30, రెన్యూవల్-20), 28న దృష్టి లోపం ఉన్నవారికి(కొత్తవి-25, రెన్యూవల్- 5), 31న మానసిక దివ్యాంగులకు (కొత్తవి-15, రెన్యూవల్-5) క్యాంపు ఉంటుందని, సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలన్నారు.

ఓపీఎస్‌పై వ్యాఖ్యలు ఆక్షేపణీయం

హన్మకొండ అర్బన్: ఓల్డ్ పెన్షన్ విధానం (ఓపీఎస్)ను రాష్ట్రాలు తీసుకొస్తే ఆర్థిక భారమన్న వ్యాఖ్యలు ఆక్షేపణీయమని సీపీఎస్ ఉమ్మడి వరంగల్ జిల్లా డిపార్ట్‌మెంటల్ ఫోరం కన్వీనర్ దొడ్డిపాటి హరికుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఓపీఎస్‌ను గత ప్రభుత్వాలే ఉద్యోగుల సంక్షేమానికి తీసుకొచ్చాయని, ఆర్థిక భారమంటూ ఆ విధానాన్ని ప్రభుత్వాలు ఎత్తేయడం సరికాదన్నారు. ఉద్యోగి సుదీర్ఘ కాలం ప్రజలకు సేవలందించి ఉద్యోగ విరమణ అనంతరం బతుకును దుర్భరంగా గడపడం సమంజసమేనా? అని ఆయన ప్రశ్నించారు. ఓపీఎస్ పునరుద్ధరణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దోబూచులాడుతున్నాయని పేర్కొన్నారు. ఓపీఎస్ అమలు చేసే రాష్ట్రాలకు ఆర్బీఐ ప్రకటన మోకాలడ్డేలా ఉందని, తక్షణమే ఆ ప్రకటనను ఉపసంహరించుకోవాలని కోరారు.

ఖేలో ఇండియా సెంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు

వరంగల్ స్పోర్ట్స్: భారత క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి ఖేలో ఇండియా సెంటర్ (జీఎంసీ బాలయోగి స్టేడియం), హైదరాబాద్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు హనుమకొండ డీవైఎస్‌ఓ గుగులోత్ అశోక్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 12 నుంచి 18 ఏళ్ల వయసున్న వారు 2023-24 సంవత్సరానికి ఆర్చరీలో బాలికలు, అథ్లెటిక్స్‌లో బాలబాలికలు, హాకీలో బాల, బాలికలు, కబడ్డీలో బాలుర, సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం ఎల్‌బీనగర్ నందు జిమ్నాస్టిక్స్ బాలబాలికల ప్రవేశానికి ఎంపికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఈనెల 31, ఫిబ్రవరి ఒకటి తేదీల్లో నిర్వహించే ఎంపికలకు హాజరు కావాలని సూచించారు. వివరాలకు 93929 97668 నంబర్‌లో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

ప్రజల కష్టాలు తెలిసిన సీఎం

- రూపాయి ఖర్చు లేకుండా కంటి అద్దాలు
- 'కంటి వెలుగు' ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి

జనగామ: ప్రజల కష్టాలు తెలిసిన సీఎం కేసీఆర్.. సంక్షేమ పథకాలు అమలు చేస్తూ వారి బతుకుల్లో వెలుగులు నింపుతున్నారని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. గురువారం అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, డీసీపీ పి.సీతారాం, ఆర్డీఓ మధుమోహన్, మున్సిపల్ చైర్‌పర్సన్ పి.జమున లింగయ్య, కమిషనర్ రజితతో కలిసి జనగామ పట్టణం 5వ వార్డు బాణాపురంలో 'కంటి వెలుగు' శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. పేదల కంటి చూపు బాగుండాలనే సంకల్పంతో ఉచిత పరీక్షలకు శ్రీకారం చుట్టారని, అత్యాధునిక పరికరాలు, అనుభవజ్ఞులైన వైద్య నిపుణుల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఫారెన్ టెక్నాలజీ సహాయంతో మెదక్ జిల్లాలోనే రీడింగ్ అద్దాలు తయారు చేస్తున్నారని, అవసరమైన వారికి రీడింగ్.. సైట్ అద్దాలు ఆన్‌లైన్ ద్వారా 14 రోజుల్లో ఇంటికే వస్తాయని చెప్పారు. కంటి చూపు సమస్యలతో ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్తే రూ.2వేల నుంచి రూ.3వేలు ఖర్చయ్యే పరిస్థితి ఉందని, ప్రభుత్వం నిర్వహించే ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ శని, ఆదివారం మినహా వారంలో మిగతా ఐదు రోజులు కంటి పరీక్షలు కొనసాగుతాయని చెప్పారు. డీసీపీ మాట్లాడుతూ కంటి వెలుగు ప్రపంచంలోనే అతిపెద్ద కార్యక్రమం అని అన్నారు. కౌన్సిలర్ నాగరాజు, కోఆప్షన్ సభ్యులు మసిఉర్ రెహమాన్, నాయకులు రావెల రవి, దేవునూరి సతీష్, ఉల్లెంగుల సందీప్, ఎండి సలీం, వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



జనగామ: బాణాపురంలో కంటివెలుగు వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి

జీపీ భూములకు ఎసరు..?

- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

జనగామ రూరల్: వెంచర్లు ఏర్పాటు చేసిన సందర్భంగా ప్రభుత్వ నిబంధనల మేరకు గ్రామ పంచాయతీలకు కేటాయించిన భూములు ఆక్రమణకు గురవుతున్నాయి. అంతే కాకుండా కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్రజాప్రతినిధుల అండతో అనుమతి లేకుండా అక్రమ వెంచర్లు ఏర్పాటు చేసి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. జనగామ మండలం యశ్వంతాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో శ్రీచక్ర వెంచర్ ఏర్పాటు చేసిన సందర్భంగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం 19-29 సర్వే నంబర్లలోని 3.28 గుంటల భూమిని జీపీకి కేటాయించారు. పంచాయతీ తీర్మానం చేసి ఫెన్సింగ్ వేసే పనిని వార్డు సభ్యుడికి అప్పగించగా అతను పూర్తి చేశాడు. ఆ భూమిలో ఏర్పాటు చేసిన ఫెన్సింగ్ ఖనీలను గుర్తు తెలియని వ్యక్తులు ఇటీవల తొలగించారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని ప్రజలు అంటున్నారు. ఇదిలా ఉండగా.. ఇటీవల 20 గుంటల భూమిలో కొందరు అక్రమంగా ఖనీలు పాతగా అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా కూల్చివేయకుండా చోద్యం చూస్తున్నారని గ్రామస్తులు తెలిపారు. అలాగే క్రీస్తు జ్యోతి ఇంజనీరింగ్ కళాశాల వెనుక 118, 166 సర్వే నంబర్లలోని గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న రెండెకరాల పైచిలుకు భూమిని కొందరు ప్రైవేటు వ్యక్తులకు విక్రయించడంపై గ్రామస్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి ఏళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదు. వీటితో పాటు మండల పరిధి పెద్దరాంచర్ల, గానుగుపహాడ్, వడ్లకొండ, పెంబర్తి, ఎర్రగొల్లపహాడ్, పెద్దపహాడ్, గ్రామాల్లో అనుమతి లేకుండా వెంచర్లు వెలుస్తున్నాయి. అయినా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



జీపీ భూమిలో పాతిన రాతి ఖనీలు

అనుమతులు తప్పనిసరి



గ్రామ పంచాయతీ పరిధి భూముల్లో వెంచర్లు చేస్తే తప్పనిసరిగా ప్రభుత్వ అనుమతి పొందాలి. నిబంధనల ప్రకారం పది శాతం స్థలం పంచాయతీ పేరు మీద రిజిస్ట్రేషన్ చేయాలి. అలా కేటాయించిన భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు. యశ్వంతాపూర్‌లో భూమిని సర్వే చేయించి హద్దులు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం.

- హసీం, ఎంపీడీఓ జనగామ

'దళిత బంధు'లో అవినీతిని అరికట్టాలి

- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎ.వెంకట్రాజం

స్టేషన్‌ఘన్‌పూర్: 'దళిత బంధు' పథకంలో అవినీతిని అరికట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎదునూరి వెంకట్రాజం, సహాయ కార్యదర్శి ఎన్నకూస కుమార్ డిమాండ్ చేశారు. గురువారం స్థానికంగా ఏర్పాటు చేసిన సంఘం సమావేశంలో వారు మాట్లాడుతూ.. దళిత కుటుంబాలను ఆదుకునేందుకు ప్రభుత్వం రూ.వేల కోట్ల బడ్జెట్‌తో ప్రవేశపెట్టిన పథకం కొంతమంది పైరవీకారులకు వరంగా మారిందన్నారు. గ్రామాల్లో ఒక్కొక్కరి వద్ద రూ.2లక్షల వరకు వసూలు చేసినట్లు చర్చ జరుగుతోందని, ఈ వ్యవహారం ప్రజాప్రతినిధుల కనుసన్నల్లోనే నడుస్తున్నట్లు ఆరోపించారు. ప్రస్తుతం దరఖాస్తు చేసుకున్న వారితోపాటు నిరుపేద దళితులందరికీ పథకం అమలు చేయాలని, లేని పక్షంలో ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పొత్కనూరి ఉపేందర్, సోమ సత్యం, సింగారపు రమేష్, మహేందర్, సాంబరాజు, దుర్గాప్రసాద్, సుధాకర్, కిష్టయ్య, పద్మ, శంకరయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్రాజం

కళాకారులతోనే సంస్కృతికి ప్రచారం

దేవరుప్పుల: కళాకారులతోనే పల్లె సంస్కృతికి ప్రచారం లభిస్తుందని బాల్‌బ్యాడ్మింటన్ స్టేట్ అసోసియేషన్ సభ్యుడు, బీఆర్ఎస్ నాయకుడు పల్ల సుందర్‌రామిరెడ్డి అన్నారు. ఒగ్గు బీర్ల కళాకారుల సంక్షేమ సంఘం రూపొందించిన క్యాలెండర్‌ను ఆయన గురువారం చిన్నమడూరులో ఆవిష్కరించి మాట్లాడారు. తెలంగాణ సాధనతోనే మన ప్రాంత సంస్కృతికి పూర్వవైభవం సంతరించుకుందన్నారు. కళాకారుల సంక్షేమానికి తోడ్పాటు అందేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కళారత్న కడకంచి పాపయ్య, సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కుమారస్వామి, బండ భిక్షపతి, బంద్రు సత్తయ్య, రాములు, యాదగిరి, గాదరి పెద్దవీరాస్వామి, సకీర్త ఐలయ్య, పీఏసీఎస్ చైర్మన్ రమేష్‌రెడ్డి, వంగ వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దయాకర్, రవి తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

నూతన ఆవిష్కరణలకు 'స్తుతి' వేదికవ్వాలి

- నిట్ డైరెక్టర్ ఎన్వీ.రమణారావు



మాట్లాడుతున్న నిట్ డైరెక్టర్ ఎన్వీ.రమణారావు

కాజీపేట అర్బన్: నూతన ఆవిష్కరణలు, పరిశోధనలకు స్తుతి కార్యక్రమం వేదికగా నిలవాలని నిట్ డైరెక్టర్ ఎన్వీ.రమణారావు తెలిపారు. నిట్ వరంగల్‌లోని సెమినార్ హాల్‌లో గురువారం సీనర్జిస్టిక్స్ ట్రెయినింగ్ ప్రోగ్రాం యుటిలైజింగ్ ద సైంటిఫిక్ అండ్ టెక్నాలజికల్ ఇన్‌ఫ్రాస్టక్చర్(స్తుతి) కార్యక్రమాన్ని నిర్వహించారు. 'ఎవాల్యుయేషన్ ఆఫ్ మెటీరియల్ ప్రాపర్టీస్ అండర్ డైనమిక్ లోడింగ్' అంశంపై వారం రోజుల వర్క్‌షాప్‌నకు నిట్ డైరెక్టర్ ఎన్వీ.రమణారావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తక్కువ ఖర్చుతో పరిశోధనల రూపకల్పనకు సెంట్రల్ రీసెర్చ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ సౌజన్యంతో స్తుతి సౌకర్యం కల్పిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిట్ రిజిస్ట్రార్ గోవర్ధన్‌రావు, ప్రొఫెసర్లు ఎన్.నరసయ్య, టీకే.సాయి, ఆరోఖ్యకుమార్, శ్రీనివాసరావు, అజయ్‌కుమార్‌పాండే తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం రావాలి

- అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ శ్రీనివాస్

జఫర్‌గఢ్: ప్రతి విద్యార్థికి తప్పనిసరిగా చదవడం, రాయడం రావాలి.. ఇందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్(ఏఎంఓ) శ్రీనివాస్ కోరారు. గురువారం ఆయన మండల పరిధి తీగారం, తమ్మడపల్లి(జి), ఓబులాపూర్, కూనూర్ పాఠశాలల్లో ఎఫ్ఎల్ఎన్ ప్రోగ్రాం పని తీరును ఎంఈఓ భగవన్‌తో కలసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారి విద్యాప్రగతికి కృషి చేయాలని, ఉపాధ్యాయుల బోధన తీరును మరింత మెరుగుపర్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా 'మనఊరు-మనబడి' కింద తీగారం, తమ్మడపల్లి(జి) పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం ఎంఆర్సీ సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించి ఓఎస్సీ సర్వే వివరాలు తెలుసుకున్నారు. ఎంఐఎస్ శివకృష్ణ, సీఆర్పీలు స్వామి, సాంబయ్య, బాబు, రమాదేవి, సునీత తదితరులు పాల్గొన్నారు.



తీగారం పాఠశాలను పరిశీలిస్తున్న శ్రీనివాస్

డిగ్రీ పరీక్షల్లో 26 మంది డీబార్

కేయూ క్యాంపస్: కేయూ పరిధి డిగ్రీ పరీక్షల్లో గురువారం నిర్వహించిన పరీక్షల్లో 26 మంది విద్యార్థులు డీబార్ అయ్యారు. ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో డిగ్రీ బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ తదితర కోర్సుల్లో వివిధ పరీక్షా కేంద్రాల్లో కాపీయింగ్ చేస్తూ 26 మంది స్క్వాడ్‌లకు పట్టుబడి డీబార్ అయినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు జి.మధుకర్, ఎ.నరేందర్ ఒక ప్రకటనలో తెలిపారు.

- ఉద్యోగులనూ పంపే యోచన!
- డిమాండ్‌కు అనుగుణంగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి
- సబ్బండ వర్గాల సంక్షేమమే లక్ష్యం

- 10లో▸

'ఐటీ హబ్'కు నిర్లక్ష్యపు వైరస్

- 2013లోనే ఏర్పాటుకు అడుగులు
- 2017లో మొదటి కంపెనీ ప్రారంభం
- ఆరేళ్లలో వచ్చినవి నాలుగు కంపెనీలే..
- మౌలిక వసతుల లేమితో ముందుకు రాని కంపెనీలు



హన్మకొండ చౌరస్తా: వరంగల్‌ను ఐటీ హబ్‌గా తీర్చిదిద్దుతామన్న పాలకుల హామీకి నిర్లక్ష్యమనే వైరస్ పట్టింది. 1400పైగా ఐటీ కంపెనీలతో రాష్ట్ర రాజధాని హైదరాబాద్ విరాజిల్లుతుంటే.. అంతే చరిత్ర కలిగి రాష్ట్ర రెండో రాజధానిగా చెప్పుకుంటున్న ఓరుగల్లు నగరం మాత్రం కేవలం నాలుగు కంపెనీలకే పరిమితమైంది. కంపెనీలు రాకపోవడానికి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో పురోగతి లేకపోవడమే కారణం. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తేనే ఐటీకి కేరాఫ్‌గా వరంగల్ మారుతుందని నిపుణులు చెబుతున్నారు. ఇక స్వస్థలంలో సరైన అవకాశాలు లేక వరంగల్‌కు చెందిన వేల మంది యువ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు హైదరాబాద్, ముంబాయి, బెంగుళూరు వంటి నగరాలకు వలస వెళ్తున్నారు. వరంగల్‌లో ఐటీ కంపెనీలు, స్టార్టప్ కంపెనీల పరిస్థితిపై సాక్షి ప్రత్యేక కథనం.

2013లోనే అడుగులు..

వరంగల్‌కు ఐటీ రంగాన్ని తీసుకురావాలని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి మంత్రి పొన్నాల లక్ష్మయ్య కాంక్షించారు. నగర శివారులోని మడికొండ ప్రాంతంలో ఐటీ కంపెనీలు స్థాపించేందుకు 2013లో ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందజేశారు. దీంతో ఆంధ్రప్రదేశ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్, ఇండస్ట్రీయల్ కార్పొరేషన్ 2014లో 40 ఎకరాల స్థలాన్ని ఐటీ హబ్‌కు అనువుగా గుర్తించింది. అదే సమయంలో మరో 100 ఎకరాలు అవసరమని ప్రభుత్వాన్ని కోరారు. ఇంతలోనే తెలంగాణ రాష్ట్రం సిద్ధించడం, ప్రభుత్వాలు మారడంతో ప్రతిపాదనలు మూలకుపడ్డాయి.

2017లో మొదటి కంపెనీ..

2014లో ఐటీ పార్కుకు అడుగులు పడగా మూడేళ్ల సుదీర్ఘ కాలం తర్వాత 2017 జనవరి 22న మొదటి ఐటీ కంపెనీ సీయెంట్ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభమైంది. నాలుగెకరాల స్థలంలో కొనసాగుతున్న ఈ కంపెనీలో ప్రస్తుతం 250 వరకు ఉద్యోగులు పనిచేస్తున్నారు. డిజిటల్ టెక్నాలజీ, ఇంజనీరింగ్ మ్యాన్‌ఫ్యాక్చరింగ్, టెలీ కమ్యూనికేషన్ సేవలను సీయెంట్ కంపెనీ అందిస్తోంది.

మౌలిక వసతులు కల్పిస్తేనే..

కొత్త కంపెనీలు ముందుకు రాకపోవడానికి ప్రధాన కారణం మౌలిక వసతులు లేకపోవడం. పార్కులో రోడ్లు, డ్రైనేజీ, నీటి వనరులు లేకపోవడం వల్లే కొత్త కంపెనీలు ఆసక్తి చూపడం లేదని నిపుణులు చెబుతున్నారు. దీనికితోడు మొదట్లో గజానికి రూ.700 ధర నిర్ణయించిన ప్రభుత్వం ప్రస్తుతం రూ.2000 చొప్పున వసూలు చేస్తూ కేవలం 30 ఏళ్ల లీజు నిబంధన పెట్టింది. దీంతో కంపెనీలు వెనుకడుగు వేస్తున్నాయని నిపుణులు అంటున్నారు.

ఆరేళ్లలో వచ్చినవి నాలుగే..

హైదరాబాద్‌కు దీటుగా వరంగల్ నగరాన్ని తీర్చిదిద్దుతామని చెప్పిన పాలకులు చేతల్లో విఫలమయ్యారనే విమర్శలు ఘాటుగా వినిపిస్తున్నాయి. గడిచిన ఆరేళ్లలో నగరానికి కేవలం మూడు ఐటీ కంపెనీలే వచ్చాయి. అందులో ఒకటి సీయెంట్ కాగా వెంటాయిస్, కాకతీయ టెక్నాలజీ కంపెనీలతో పాటు టెక్ మహీంద్ర కంపెనీ మడికొండ ఐటీ పార్కులో నిర్మాణంలో ఉన్న ఇంక్యుబేషన్ టవర్‌లో కొనసాగుతుంది. వీటి తర్వాత ఏ ఒక్క కార్పొరేట్ ఐటీ కంపెనీ కూడా వరంగల్‌లో ఏర్పాటు చేసేందుకు సుముఖత చూపలేదు.

వరంగల్‌పై సవతి తల్లి ప్రేమ..



త్వరలో వరంగల్ నగరానికి ఐటీ దిగ్గజ కంపెనీలు వస్తాయని వేదికలపై ఐటీశాఖ మంత్రి కేటీఆర్ చెప్పిన వ్యాఖ్యలు మాటలకే పరిమితమయ్యాయి. వరంగల్‌పై కేసీఆర్ సర్కార్‌ది కేవలం సవతి తల్లి ప్రేమే అని తేలిపోయింది. అందుకు నగరంలో నడుస్తున్న నాలుగు కంపెనీలే ఉదాహరణ. కేసీఆర్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఐటీ పార్కులో వసతులు కల్పించి కొత్త కంపెనీలను తీసుకురావాలి.

- పుల్లూరు సుధాకర్, ఫోరం ఫర్ బెటర్ వరంగల్ అధ్యక్షుడు

ఇంక్యుబేషన్, మెంటర్స్ సౌకర్యం కల్పించాలి



వరంగల్ నగరంలో 30 నుంచి 40 వరకు స్టార్టప్ కంపెనీలు ఉన్నాయి. వాటికి ప్రభుత్వం తరఫున ఇంక్యుబేషన్, మెంటర్స్ సౌకర్యం కల్పించాలి. జీఎస్టీలో రీయింబర్స్‌మెంట్, రాయితీపై రుణాలు, ఐటీ పార్కు లీజు కాలాన్ని మరింత పెంచి ధరను తగ్గించి స్టార్టప్ కంపెనీలకు ఇవ్వాలి. ప్రభుత్వ ప్రాజెక్టులలో స్టార్టప్ కంపెనీలను భాగస్వామ్యం చేయాలి.

- ఆడెపు వెంకటేశ్, ఎస్‌వీ యాప్స్ సాఫ్ట్ సొల్యూషన్స్ చైర్మన్, హనుమకొండ

టేకు కలపతో భార్య ప్రతిమ



టేకు కలపతో రూపొందించిన పకీరిబాయి ప్రతిమ

కురవి: చనిపోయిన భార్యకు గుర్తుగా ఆమె విగ్రహం తయారు చేయించడం చూస్తుంటాం. కానీ టేకు కలపతో భార్యప్రతిమ చేయించాడు ఓ భర్త. మహబూబాబాద్ జిల్లా కురవి మండలం కొత్తూరు(జీ) శివారు తాట్యతండాకు చెందిన జాటోత్ వాల్యా.. భార్య పకీరిబాయి గత ఏడాది చనిపోయింది. ఆమెపై ఉన్నప్రేమకు గుర్తుగా భర్త.. పకీరిబాయి ప్రతిమను టేకు కలపతో చేయించాడు. ఎడ్లబండిలో ఉన్నట్లు చెక్కించి ఇంట్లో ప్రతిష్ఠించాడు. కాగా, గురువారం వాల్యను మంత్రి సత్యవతి రాథోడ్ పరామర్శించి పకీరిబాయి ప్రతిమను ఆసక్తిగా తిలకించారు.

9మందిపై చీటింగ్ కేసు నమోదు

ఖిలా వరంగల్: వాహనాల నంబర్ ప్లేట్లపై స్టిక్కర్ అతికించి, నంబర్లు కనిపించకుండా ట్యాంపరింగ్‌కు పాల్పడిన తొమ్మిది మంది వాహనదారులపై చీటింగ్ కేసు నమోదు చేసి మిల్స్‌కాలనీ పోలీసులకు అప్పగించినట్లు ట్రాఫిక్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. శంభునిపేట గవిచర్ల క్రాస్ రోడ్డు జంక్షన్‌లో ఎస్సైలు రాజబాబు, డేవిడ్, ఆర్ఎస్సైలు పూర్ణ చందర్‌రెడ్డి, శ్రవన్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో చోరీ



వివరాలు సేకరిస్తున్న క్లూస్ టీం

ఖానాపురం: వరంగల్ జిల్లా ఖానాపురం మండలం బుధరావుపేట వేంకటేశ్వరస్వామి ఆలయంలో చోరీ జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామ సమీపంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలోకి బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించారు. హుండీ తాళాన్ని తొలగించి పక్కనే ఉన్న చెరువు కట్టపైకి తీసుకెళ్లారు. అక్కడ గొడ్డలి సాయంతో హుండీని పగలగొట్టి అందులో ఉన్న నగదును అపహరించుకుపోయారు. గురువారం ఉదయం ఆలయంలోకి వెళ్లిన అర్చకులు హుండీ చోరీకి గురైనట్లు గమనించారు. పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై తిరుపతి చేరుకొని క్లూస్‌టీంకు సమాచారం ఇచ్చారు. క్లూస్‌టీం ఎస్సై శ్రీధర్ ఆధ్వర్యంలో సిబ్బంది చేరుకుని హుండీ, గొడ్డలిపై ఉన్న వేలిముద్రలు సేకరించారు. జాగిలంతో ఆలయ ప్రాంగణంతో పాటు చెరువు కట్టపై వెతికారు. కాగా, పక్కనే ఆలయ నిర్మాణ పనులు చేస్తున్న వారు బయటకు రాకుండా దొంగలు బయటి నుంచి గొళ్లెం పెట్టారు. ఆలయ కమిటీ నిర్వాహకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. గతంలో రెండుసార్లు ఇదే ఆలయంలో హుండీ చోరీకి గురైంది.

ఆర్టీసీ బస్సు ఢీకొని కానిస్టేబుల్ మృతి

- ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్‌గా నరేష్ విధులు
- ఎస్సై ఈవెంట్స్‌లో ఉత్తీర్ణత, అంతలోనే విషాదం

నడికూడ: రోడ్డు ప్రమాదంలో సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ మృతి చెందిన సంఘటన హనుమకొండ జిల్లా నడికూడ మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు, పరకాల పోలీసుల కథనం ప్రకారం.. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం శనిగరం గ్రామానికి చెందిన బండి నరేష్(28)ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని కాన్పూర్ జిల్లాలో సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు.



నరేష్ (ఫైల్)

నెల రోజుల క్రితం ఎస్సై ఈవెంట్స్ కోసం సెలువుపై గ్రామానికి వచ్చాడు. ఎస్సై ఈవెంట్స్‌లో ఉత్తీర్ణత కూడా సాధించాడు. గురువారం బైక్‌పై వెళ్లి చర్లపల్లిలోని బంధువులను కలిశాడు. అక్కడ నుంచి పులిగిల్లలో బంధువుల ఇంటికి వెళ్లే క్రమంలో పరకాల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు చర్లపల్లి గ్రామ శివారులో బైక్‌ను ఢీకొట్టింది. దీంతో నరేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పరకాల పోలీసులు తెలిపారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. నరేష్ తల్లిని ఓదార్చారు.

విద్యుత్‌షాక్‌తో రైతు..

గణపురం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం బస్వరాజుపల్లి గ్రామానికి చెందిన అంబటి మల్లయ్య(60) అనే రైతు తన వ్యవసాయ క్షేత్రంలో విద్యుత్‌షాక్‌తో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం ప్రకారం.. రవినగర్ శివారు మంగళికుంట సమీపంలో మల్లయ్యకు ఎకరం పొలం ఉంది. గురువారం పని నిమిత్తం వెళ్లాడు. ఈ క్రమంలో పొలంలో ఉన్న బోరు మోటార్ తీగ తగిలి విద్యుత్‌షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అభినవ్ తెలిపారు.



మల్లయ్య మృతదేహం

ఖమ్మం సభ గ్రాండ్ సక్సెస్

- రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



విలేకరులతో మాట్లాడుతున్నమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, చిత్రంలో ఎంపీ దయాకర్, ఎమ్మెల్యేలు వినయ్‌భాస్కర్, అరూరి రమేశ్, నన్నపునేని నరేందర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి తదితరులు

హన్మకొండ: ఖమ్మంలో నిర్వహించిన భారత రాష్ట్ర సమితి ఆవిర్భావ సభ గ్రాండ్ సక్సెస్ అయిందని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. 5 లక్షల మంది ప్రజలు వస్తారని అంచనా వేసుకుంటే 6 లక్షలకు పైగా వచ్చారని, నాలుగు గంటలు వేచిఉండి సీఎం కేసీఆర్, వచ్చిన అతిథిలు ప్రసంగాలు ఓపికగా విన్నారని, సభాస్థలి బయట లక్షన్నర మంది ఉండిపోయారన్నారు. సభకు తరలివచ్చిన విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. గురువారం హనుమకొండ ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశమంతా సీఎం కేసీఆర్ వైపు చూస్తుందని, తెలంగాణలో అమలవుతున్న పథకాలు దేశ వ్యాప్తంగా అమలు చేయాలని కోరుకుంటున్నారన్నారు. మిషన్ భగీరథ పథకం దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ఈ సభను చూసి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పిచ్చి కూతలు కూస్తున్నారని, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ బుద్ధి లేకుండా మాట్లాడుతున్నారని, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పిచ్చి పిచ్చిగా మాట్లాడుతున్నాడని తూర్పారబట్టారు. ముందుగా కాంగ్రెస్ పార్టీని కాపాడుకోవాలని రేవంత్‌రెడ్డికి సూచించారు. చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ బీజేపీ నాయకులు కంటి వెలుగులో పరీక్షలు చేయించుకుని అద్దాలు పెట్టుకుని చూస్తే ఇక్కడి అభివృద్ధి, సంక్షేమ పథకాలు కనిపిస్తాయన్నారు. బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఆరూరి రమేష్ మాట్లాడుతూ ఖమ్మం బీఆర్ఎస్ సభ కొత్త చరిత్రకు నాంది అని అన్నారు. సమావేశంలో ఎంపీ పసునూరి దయాకర్, ఎమ్మెల్యేలు నన్నపునేని నరేందర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, కుడా చైర్మన్ సంగం రెడ్డి సుందర్ రాజు యాదవ్, మేయర్ గుండు సుధారాణి, నాయకులు లలితా యాదవ్, గాంధీ నాయక్, యాకూబ్ రెడ్డి పాల్గొన్నారు.

స్టార్టర్ ఆన్ చేస్తూ మరొకరు..



రవి మృతదేహం

కురవి: విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన సంఘటన మహబూబాబాద్ జిల్లా కురవి మండలం కొత్తూరు(జీ) శివారు బంచరాయితండాలో గురువారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. బంచరాయితండాకు చెందిన బానోత్ రవి(40) అనే రైతు అదే గ్రామానికి చెందిన నారాయణ అనే రైతు పొలాన్ని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. గురువారం ఏటి ఒడ్డున ఉన్న పొలానికి నీళ్ల పెట్టేందుకు వెళ్లాడు. మోటార్ స్టార్టర్ ఆన్ చేసే క్రమంలో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. దీంతో కిందపడి కొట్టుకుంటుండగా పక్క పొలం రైతులు, తండావాసులు గమనించి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అపస్మారక స్థితిలో ఉన్న రవిని వెంటనే మహబూబాబాద్ జనరల్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అతడు మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడికి భార్య రాజేశ్వరి, కొడుకు, కుమార్తె ఉన్నారు. ఈ విషయమై ఎస్సై బి.రామును వివరణ కోరగా ఫిర్యాదు అందలేదని తెలిపారు.

చెరువులో పడి మహిళ..

మంగపేట: ములుగు జిల్లా మంగపేట మండలం బాలన్నగూడెం గ్రామానికి చెందిన చెరుకుల సూరమ్మ(52) గ్రామ సమీపంలోని పెద్దచెరువులో పడి మృతి చెందింది. ఏఎస్సై అబ్బయ్య కథనం ప్రకారం.. కొంతకాలంగా సూరమ్మ మతిస్థిమితం సరిగా లేనట్లు ప్రవర్తిస్తోంది. ఈ నెల 16న ఇంటి నుంచి బయటకి వెళ్లి తిరిగి రాలేదు. గతంలో ఇంటి నుంచి వెళ్లి తెలిసిన వారు, బంధువుల ఇళ్లలో ఉండి కొద్ది రోజుల తర్వాత తిరిగి వచ్చేది. దీంతో ఎక్కడో ఓ చోట ఉండి ఉంటుందని కుటుంబ సభ్యులు భావించారు. కాగా, తిమ్మంపేటకు చెందిన రైతు గుండు నర్సయ్య గురువారం చెరువు వద్దకు వెళ్లగా నీటిలో మహిళ మృతదేహం కనిపించింది. విషయాన్ని బాలన్నగూడెం గ్రామస్తులకు తెలియజేశాడు. గ్రామస్తులు చేరుకుని సూరమ్మ మృతదేహంగా గుర్తించారు. మృతురాలి భర్త లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

మిర్చి కల్లంలో కూలీగా..



వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి గురువారం శాయంపేట మండల కేంద్రంలో కంటి వెలుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం భూపాలపల్లికి వెళ్తున్న క్రమంలో రేగొండ మండలంలోని గోరికొత్తపల్లి–నిజాంపల్లి శివారులో మిర్చి ఏరుతున్న కూలీలను చూసి వాహనాన్ని ఆపారు. కూలీలతో కలిసి కొంతసేపు తాలు మిర్చి ఏరి మహిళా కూలీల బాగోగులు తెలుసుకున్నారు.

- టేకుమట్ల(రేగొండ)

వీధి కుక్కల దాడిలో గొర్రెల మృతి



కుక్కల దాడిలో మృతి చెందిన గొర్రెలు

వర్ధన్నపేట: వీధి కుక్కల దాడిలో 7 గొర్రెలు మృతి చెందాయి. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం చెన్నారంలో గురువారం ఈ ఘటన చోటు చేసుకుంది. బాధితుడు అమరాజు స్వామి కథనం ప్రకారం.. చెన్నారం గ్రామంలో రెండో విడత కంటి వెలుగు కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆరూరి రమేష్ హాజరు కాగా, అమరాజు స్వామి కుటుంబ సభ్యులు పాల్గొని ఇంటికి వెళ్తున్నారు. అదే సమయంలో వీధి కుక్కలు వెంట పడడంతో పరిగెత్తి ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకున్నారు. ఈ క్రమంలో పక్కనే ఉన్న గొర్రెల షెడ్డులోకి వెళ్లిన వీధి కుక్కలు గొర్రెలపై దాడి చేయడంతో 7 మృతి చెందాయి. దీంతో రూ.60 వేల నష్టం వాటిల్లిందని బాధితులు వాపోయాడు. గ్రామంలో కుక్కల బెడద ఉందని పంచాయతీ అధికారులకు చెప్పినా పట్టించుకోలేదని, ప్రభుత్వం తరఫున ఆర్థికసాయం అందించాలని కోరాడు.

ధర్మకర్తల మండలి నియామక జీఓ సస్పెన్షన్

- 11న మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన హైకోర్టు
- కోర్టు వెబ్‌సైట్‌లో ఉత్తర్వులు

ఐనవోలు: ఐనవోలు ఆలయ ధర్మకర్తల మండలి నియామక ఉత్తర్వుల జీఓ నంబర్ 11ను సస్పెన్షన్ చేస్తూ ఈ నెల 11న హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, హైకోర్టుకు సెలవులు ఉండడంతో ఉత్తర్వుల ప్రతులు బుధవారం రాత్రి హైకోర్టు వెబ్‌సైట్‌లో అందుబాటులోకి వచ్చాయి. కాగా, ఐనవోలు మల్లికార్జున స్వామి ఆలయ ట్రస్టు బోర్డు నియామకానికి డిసెంబర్ 15న నోటిఫికేషన్ వెలువడింది. 20 రోజులపాటు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించారు. జనవరి 5తో గడువు ముగియడంతో ఈ నెల 10న ఎండోమెంట్ కమిషనర్ 14 మంది సభ్యులు, ఒక ఎక్స్‌అఫిషియో మెంబర్‌తో నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో హనుమకొండకు చెందిన పైల శ్రీనివాసులు అనే వ్యక్తి నియమ నిబంధనలు పాటించకుండా ఎండోమెంట్ కమిషనర్ జీఓ 11 వెలువరించారని, జీఓను రద్దు చేయాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించాడు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం ఈ నెల 11న జీఓను సస్పెన్షన్ చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ప్రతివాదులు ఫిబ్రవరి 8 వరకు కౌంటర్ దాఖలు చేసుకునే అవకాశం ఉంది.

గంజాయి ముఠా గుట్టురట్టు

- ఆరుగురి నిందితుల అరెస్ట్



నిందితుల అరెస్ట్ చూపుతున్న డీఎస్పీ రాంమోహన్‌రెడ్డి

మహదేవపూర్: ఛత్తీస్‌గఢ్ నుంచి జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు గంజాయి తరలిస్తున్న ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. మహదేవపూర్ పోలీస్‌స్టేషన్‌లో కాటారం డీఎస్పీ రాంమోహన్‌రెడ్డి గురువారం వివరాలు వెల్లడించారు. ఈ నెల 12న కాళేశ్వరం అంతర్రాష్ట్ర బ్రిడ్జి వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో పల్సర్ బైక్ వచ్చిన షారుక్‌ఖాన్, మారెపల్లి మల్లేష్ అనుమానాస్పదంగా కనిపించడంతో సోదాలు చేశారు. వారి వద్ద 1,300 గ్రాముల గంజాయి లభించింది. నిందితులను అదుపులోకి తీసుకుని కోర్టుకు తీసుకెళ్తున్న క్రమంలో జిల్లా కేంద్రానికి చేరుకోగానే షారుక్‌ఖాన్ పోలీసులను నెట్టివేసి పరారయ్యాడు. దీంతో ఎస్పీ సురేందర్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. ఈనెల 18న పలిమెల మండలంలో వాహనాల తనిఖీ చేస్తుండగా షారుక్‌ఖాన్‌తో పాటు పేరుక రాజకుమార్, సడల సురేందర్, జన్నే రాజశేఖర్, ఆముదాల కార్తీక్ గంజాయితో పట్టుబడ్డారు. విచారణలో ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్‌కు చెందిన చాందినీఖాన్ వద్ద గంజాయి కొనుగోలు చేసినట్లు తేలింది. దీంతో పోలీసులు ఆమె వద్ద సుమారు 2 కేజీల ఎండు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితులు భూపాలపల్లిలోని రాజీవ్‌నగర్‌కు చెందిన ఎండి షారుక్‌ఖాన్, గణపురం మండలం చెల్పూర్‌కు చెందిన ఆముదాల కార్తీక్, పేరుక రాజకుమార్, కొంపల్లికి చెందిన సడల సురేందర్, గొర్లవీడుకు చెందిన జన్నే రాజశేఖర్, బీజాపూర్‌కు చెందిన చాందినీ ఖాన్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. నిందితులను అరెస్ట్ చేయడంలో ప్రతిభ కనబరిచిన ఎస్సైలు లక్ష్మణ్‌రావు, అరుణ్, రాజ్‌కుమార్, ఏఎస్సైలు మల్లేశ్వర్, నాగయ్య, పీసీలు బాల్‌సింగ్, కిరణ్, సంతోష్, ధనుంజయ్, సమ్మయ్య, దేవేందర్, శ్యామ్, తిరుపతి, అన్వేష్, వేణు, లావణ్య, శిరీష, స్వాతిలను డీఎస్పీ అభినందించారు.

జీపీ స్థల విషయంలో ఇరువర్గాల ఘర్షణ

- కత్తులతో దాడి.. ఇద్దరికి గాయాలు
- బుర్రకాయలగూడెంలో ఘటన





గాయపడిన నాను, రవీందర్

గణపురం: నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి కేటాయించిన స్థలం ఇరువర్గాల మధ్య ఘర్షణకు దారి తీసింది. ఓ వర్గం వారు మరో వర్గంపై కత్తులతో దాడి చేయడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం బుర్రకాయలగూడెంలో గురువారం ఈ ఘటన చోటు చేసుకుంది. ఎస్సై అభినవ్ కథనం ప్రకారం.. బుర్రకాయలగూడెం జీపీ భవన నిర్మాణం కోసం తహసీల్దార్ సతీష్‌కుమార్ 10 గుంటల భూమి కేటాయించారు. భవన నిర్మాణాన్ని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి శుక్రవారం(నేడు) ప్రారంభించనున్నారు. ఈ క్రమంలో గురువారం శిలాఫలకం పనులు చేస్తుండగా స్థలం తమదంటూ ఎంపీటీసీ కాలియా సాగర్, ప్రవీణ్, శ్రీబాబు, కాలియా గోపాల్ అడ్డుకున్నారు. పనులు చేయిస్తున్న తుమ్మల నాను, తుమ్మల రవీందర్‌తో గొడవకు దిగి కత్తులతో దాడి చేశారు. దీంతో నాను, రవీందర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. బాధితులను 108 వాహనంలో భూపాలపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని తహసీల్దార్, ఎస్సై పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అజాగ్రత్తగా వాహనం నడిపిన వ్యక్తిపై కేసు

చెన్నారావుపేట: అజాగ్రత్తగా వాహనం నడిపిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తోట మహేందర్ తెలిపారు. వరంగల్ జిల్లా నర్సంపేట మండలం ద్వారకపేటకు చెందిన గోపగాని సాయిచరణ్ ఈ నెల 15న తన పల్సర్ బైక్‌పై చెన్నారావుపేట మండల కేంద్రంలోని నంబర్ వన్ కాలనీలో గల అత్తగారింటి నుంచి నర్సంపేటకు వెళ్తున్నాడు. పార్కులైన్ వైన్ షాపు వద్దకు రాగానే నర్సంపేటకు చెందిన గ్యార శ్రీకాంత్ తన ఎర్టిగా వాహనంతో వేగంగా దూసుకొచ్చి అకస్మాత్తుగా రోడ్డుపై ఆపాడు. దీంతో పల్సర్ బండిపై వస్తున్న సాయిచరణ్ కారును ఢీకొట్టి కిందపడిపోయాడు. అతడికి తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. బాధితుడి సోదరుడు నాగరాజు ఫిర్యాదు మేరకు అజాగ్రత్తగా వాహనం నడిపిన శ్రీకాంత్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.